క్లుప్తంగా

ఆలయాల ధర్మకర్తల మండలి ఏర్పాటు



నెల్లూరు(బృందావనం): ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామస్వామి, అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీవిశ్వనాథ స్వామి దేవస్థానాలకు నూతన ధర్మకర్తల మండలి కమిటీ బుధవారం ఏర్పాటైంది. ఆయా ఆలయాల ధర్మకర్తల మండలి చైర్మన్‌గా బి.వెంకటశ్రీనివాస్, సభ్యులుగా కె.రమేష్‌బాబు, ఎం.సునీత, డి.లలిత, వి.సుమంత్‌కుమార్, జి.శ్రీవాణి, డి.రాజేశ్వరి, బి.నాగేంద్ర, బి.రాధయ్యలతో ఈఓ జి.దర్గయ్య ప్రమాణ స్వీకారం చేయించారు.

ఉపాధి సిబ్బందితో సమీక్ష

నెల్లూరు(పొగతోట): స్థానిక డీఆర్‌డీఏ మీటింగ్ హాల్లో నెల్లూరు డివిజన్ పరిధిలోని 15 మండలాలకు సంబంధించిన ఏపీఎంలు, సీసీలతో ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజకుమారి బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. డీఆర్‌డీఏలో జరిగే ముఖ్యమైన కార్యక్రమాలైన బ్యాంకు లింకేజీ, ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్, జీవనోపాధుల్లో ఫార్మ్, నాన్ ఫార్మ్ కార్యక్రమాలు, ఉన్నతి, స్త్రీనిధి, ఐబీ అండ్ ఫిషరీస్ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి వారు చేపట్టాల్సిన లక్ష్యాలు నిర్దేశించారు. సమావేశంలో జిల్లాలోని డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

నిబద్ధత ఉంటే అవార్డులు సొంతం



అవార్డులు అందుకున్న వారిని సన్మానిస్తున్న ఎస్‌ఈ విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విధి నిర్వహణలో నిబద్ధత ఉంటే అవార్డులు సొంతం అవుతాయని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా అవార్డులు అందుకున్న విద్యుత్‌శాఖ అధికారులను నగరంలోని విద్యుత్ భవన్‌లో ఆయన బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవార్డులు అందుకోవడం అంటే ఒక గుర్తింపు మాత్రమే కాదని, పనితనం, అంకితభావానికి వచ్చిన గౌరవంగా పేర్కొన్నారు. సన్మానం అందుకున్న వారిలో ఈఈలు శ్రీధర్, బెనర్జీ, రమేష్‌చౌదరి, డీఈఈలు అశోక్, పవన్‌తో పాటు ఈఈ శేషాద్రి బాలచంద్ర, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, రూరల్ ఈఈలు సోమశేఖర్‌రెడ్డి, పరంధామయ్య, డీఈఈలు కిరణ్, మధు, ప్రభాకర్, మునింద్ర, సునీల్ ఉన్నారు.

భగవద్గీత జ్ఞాన పరీక్షలు

నెల్లూరు(బృందావనం): డైకస్‌రోడ్డు సెంటర్ దగ్గర ఉన్న పొగాకు గోడౌన్ ప్రాంగణంలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఐదో రోజు బుధవారం విద్యార్థులకు భగవద్గీత జ్ఞాన పరీక్షలు నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి–ఇందూ జ్ఞానవేదిక నెల్లూరు కమిటీ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో నగరంలోని వివిధ విద్యాసంస్థల నుంచి 140 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆ కమిటీ అధ్యక్షుడు చంద్రమౌళి తెలిపారు.

మాజీ ప్రధానికి నివాళి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ధనుంజయ, హనీఫ్, ఖాదర్‌బాషా, మల్లికార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరమైన వ్యక్తి పేనేటి సుధాకర్



మాట్లాడుతున్న మురళీయాదవ్

నెల్లూరు సిటీ: 17వ డివిజన్ కార్పొరేటర్ పేనేటి సుధాకర్ ప్రమాదకరమైన వ్యక్తి అని వైఎస్సార్‌సీపీ బీసీ నాయకుడు ఉడతా మురళీయాదవ్ అన్నారు. కల్లూరుపల్లిలోని ఆయన నివాసంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. గతంలో పేనేటి సుధాకర్ తన మనుగడకు ఇబ్బందిగా ఉందని, నువ్వే దిక్కని ఆనం విజయకుమార్‌రెడ్డి వద్దకు వచ్చి కాళ్లు పట్టుకున్నారన్నారు. ఇప్పుడు ఆయనపై అభ్యంతరకరంగా మాట్లాడడం తగదన్నారు. చాడీలు చెప్పడం ఆయన నైజమని, అలాంటి వ్యక్తులు రాజకీయాల్లో ప్రమాదకరమని తెలిపారు. వైఎస్సార్‌సీపీ రూరల్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు నవీన్ కుమార్‌రెడ్డి, పార్టీ నేత సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష

నెల్లూరు(బారకాసు): నగరంలోని కార్పొరేషన్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై ఆర్డీఓ అనూష, కమిషనర్ నందన్‌తో పాటు పలు శాఖల అధికారులతో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. గతేడాది జరిగిన చిన్నచిన్న పొరపాట్లు పునరావృతం కాకుండా సరిచేసుకుంటామన్నారు.

భక్తిశ్రద్ధలతో త్రయోదశి

నెల్లూరు(బృందావనం): నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న శివాలయాల్లో త్రయోదశిని బుధవారం శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆది దంపతులు, నందీశ్వరులకు అభిషేకార్చనలు, పూజలు కనుల పండువగా జరిపారు.

- మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరాలయంలో స్వామివార్లకు, నందీశ్వరునికి అభిషేకార్చనలు, పూజలు విశేషంగా నిర్వహించారు. రాత్రి చిన్నవెండి నంది ఉత్సవం, ఊరేగింపు వైభవంగా జరిపారు. కార్యక్రమాలను దేవస్థానం ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.
- కరెంటాఫీస్ సెంటర్ దగ్గర ఉన్న రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో మీనాక్షి సుందరేశ్వరస్వామి ఆలయంలో స్వామివార్లు, నందీశ్వరుని అభిషేకార్చనలు, పూజలు నిర్వహించారు. దేవస్థానం ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పాల్గొని, పర్యవేక్షించారు.



మూలస్థానేశ్వరుని సన్నిధిలో..



సుందరేశ్వరస్వామి సన్నిధిలో నందీశ్వరునికి అర్చనలు

కాకాణిని కలిసిన మొయిళ్ల గౌరి



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు కేంద్ర కార్యాలయం నుంచి విడుదలైన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని తాడేపల్లిలో రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి సురేష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి కాకాణికి శాలువా కప్పి సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. వారి వెంట నాయకులు ఉన్నారు.

మోతాదులోనే యూరియాను వినియోగించాలి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

నెల్లూరు సిటీ: అనుమతించిన మోతాదులోనే రైతులు యూరియాను వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి అన్నారు. రూరల్ మండలంలోని పెనుబర్తి గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణా కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు యూరియాను ఇష్టానుసారంగా వాడరాదని కోరారు. ప్రతి రైతు విధిగా పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం రాని రైతులు వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి తగిన పత్రాలు అందజేయాలని సూచించారు. ఆత్మ పీడీ మురళి వ్యవసాయ యాంత్రీకరణతో పాటు డ్రోన్ల గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు బి.శ్రీదేవి, నాగమోహన్, షర్మిల, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం



రోనాల్డ్ రాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హుస్సేనమ్మ

నెల్లూరు(అర్బన్): దోమలను నిర్మూలించడం ద్వారానే డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికున్‌గన్యా, జికా వైరస్ లాంటి జబ్బులను దూరం చేయవచ్చని జిల్లా మలేరియా నివారణాధికారిణి హుస్సేనమ్మ తెలిపారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దోమల వల్ల కలిగే వ్యాధుల గురించి తెలిపే వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల ద్వారా మలేరియా వ్యాప్తి జరుగుతుందని సర్ రోనాల్డ్ రాస్ గుర్తించిన రోజును ప్రపంచ దోమల నివారణ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. దోమలు కుట్టకుండా, పుట్టకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. తొలుత రోనాల్డ్ రాస్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సహాయ మలేరియా నివారణాధికారి నాగార్జునరావు, సబ్ యూనిట్ ఆఫీసర్లు, డెమో కార్యాలయ సిబ్బంది, ఫైలేరియా విభాగపు సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నాగేంద్రసాయి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలో సీపీఐ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని సీపీఐ జిల్లా నూతన కార్యదర్శిగా నియమితులైన అరిగెల నాగేంద్రసాయి అన్నారు. సంతపేటలో ఉన్న సీపీఐ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. తనపై నమ్మకం ఉంచిన పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు. ఓట్ల చోరీపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రుజువులతో నిరూపించినా ఎన్నికల కమిషన్ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. ఈనెల 23వ తేదీ నుంచి ఒంగోలులో నిర్వహించే పార్టీ రాష్ట్ర మహాసభలకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నందిపోగు రమణయ్య, కార్యవర్గ సభ్యులు మాలకొండయ్య, వినోదిని, మస్తాన్, మున్నా, శంకర్‌కిశోర్, సీనియర్ నాయకుడు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సామగ్రి అందజేత



నెల్లూరు(బృందావనం): పొదలకూరు రోడ్డు నేతాజీ నగర్‌లోని హరిత వృద్ధాశ్రమానికి జెడ్పీ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సంఘ గౌరవాధ్యక్షుడు మెట్టు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సంఘ సభ్యులు వీఎస్ ప్రసాద్, హర్షవర్ధిని దంపతులు వారి మనుమరాలు ప్రీష పుట్టినరోజు సందర్భంగా నిత్యావసర సామగ్రిని అందజేసినట్లు వివరించారు. సంఘ సభ్యులు ఖాజామస్తాన్, చెంచయ్య, కమలాకరం, బాలసుబ్రహ్మణ్యం, రాజగోపాల్, శ్రీమన్నారాయణ, ఎస్తేరు రాణి, మేరీ బ్లెస్సింగ్టన్, సావిత్రి, లక్ష్మి, వీరగంధం నాగేశ్వరరావు, ఆశ్రమ నిర్వాహకులు రాజేశ్వరి, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్‌ను రద్దు చేసి కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు అత్తిమూరు శ్రీనివాసులు, నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బాలాజీనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై చేసిన పోరాటాలు, ఆందోళనలపై సమీక్షిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ధర్నాలు తీవ్రతరం చేస్తామన్నారు. సమావేశంలో సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, అశోక్, కాయంబు శ్రీనివాసులు, దామోదర్‌రెడ్డి, కామాక్షమ్మ, సూరినారాయణ, నరసింహ తదితరులు పాల్గొన్నారను.

కుమారుడి అదృశ్యంపై ఫిర్యాదు

నెల్లూరు సిటీ: ఈనెల 11వ తేదీ నుంచి తన కుమారుడు కనిపించడం లేదని తండ్రి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని చాణక్యపురి కాలనీలో షేక్.మస్తాన్ కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. అతని పెద్ద కుమారుడు అబ్బు తయూబ్ ఇంటర్ చదువును మధ్యలోనే ఆపేశారు. ఖాళీగా ఉంట్లోనే ఉంటున్నారు. ఆత్మకూరుకు చెందిన దుర్గాభవానీ అనే మహిళతో కొంత కాలం క్రితం ఇన్‌స్టాగామ్‌లో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో 11న అబ్బు తయూబ్ ఇంటి నుంచి చిన్న పని ఉందని వెళ్లారు. తరువాత ఇంటికి తిరిగి రాకపోవడంతో పలు ప్రాంతాల్లో గాలించారు. స్నేహితులు, కుటుంబ సభ్యులకు ఫోన్లు చేసి ఆరా తీసినా సమాచారం లేకపోవడంతో తండ్రి వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి చేసి గాయపరిచారు

- భర్త ఫిర్యాదు

నెల్లూరు సిటీ: తనపై భార్య, వారి కుటుంబ సభ్యులు కలిసి దాడి చేసి, గాయపరిచారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. చంద్రమౌళీ నగర్‌లోని ఒకటో వీధిలో నివాసం ఉంటున్న ఆత్మకూరు కొండయ్య బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆయనకు భార్య సబిత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో ఈనెల 10వ తేదీన కొండయ్య డైకస్‌రోడ్డులో సెల్‌ఫోన్ మరమ్మతులు చేయించుకుని ఇంటికి తిరిగి వచ్చారు. ఈ క్రమంలో భార్య సబిత ఎక్కడికి వెళ్లావంటూ భర్తను నిలదీయడంతో ఇరువురి మధ్య మరోసారి తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. సబిత తన తల్లి లక్ష్మమ్మ, తమ్ముడు సతీష్‌కు ఫోన్ చేసి పిలిపించింది. వారు ముగ్గురు కలిసి తనపై కాళ్లతో తన్ని దాడి చేశారు. దీంతో జీజీహెచ్ హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం అడ్మిట్ అయ్యారు. కోలుకున్న తర్వాత బాధితుడు బుధవారం వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణకు డిమాండ్

నెల్లూరురూరల్: పక్కాగృహాల నిర్మాణంలో కేంద్ర నిధుల దుర్వినియోగంపై సీఎం చంద్రబాబు సిట్‌తో దర్యాప్తు చేయించాలని బీజేపీ నేతలు కాకు విజయలక్ష్మి, మిడతల రమేష్, చేనేత ఐక్య వేదిక కన్వీనర్ బుధవరపు బాలాజీ, జిల్లా ఎస్సీ నాయకులు ముద్దు శ్రీనివాసులు బుధవారం డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు నెల్లూరులో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూ.18 వేల కోట్లు హౌసింగ్ కార్పొరేషన్‌కు విడుదల చేశారని, పేదల గృహాలు కాంట్రాక్టర్ల చేత ఆప్షన్-3 కింద నిర్మిస్తున్న గృహాలు అసంపూర్ణంగా ఉండగానే ఫైనల్ బిల్లులు చెల్లించారని, అయితే ఆ గృహాలు పేదల నివాసానికి యోగ్యంగా లేవన్నారు. కేంద్ర నిధులు దుర్వినియోగం జరుగుతుండడంతో విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

ప్రాణహాని ఉంది.. రక్షించండి

నెల్లూరు రూరల్: తన భర్త పాశం అఖిల్‌కు తమ బంధువుల నుంచి ప్రాణహాని ఉందని కందుకూరుకు చెందిన కలిశెట్టి భవ్య తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మేము మేజర్లమని, ఆరేళ్ల ప్రేమించుకుని గత జూలై 23న ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నామని తెలిపారు. మా తల్లిదండ్రులు కందుకూరులో మిస్సింగ్ కేసు ఫైల్ చేశారన్నారు. వివాహమైన మరుసటి రోజు ఎస్పీని కలిసి విన్నవించామన్నారు. ఎస్పీ కూడా సానుకూలంగా స్పందించి కావలి డీఎస్పీకి నివేదించారన్నారు. డీఎస్పీ సమక్షంలో మాకు హాని చేయమని బంధువులతో సంతకాలు కూడా చేశారన్నారు. కానీ ఇప్పుడు బంధువులందరూ దూషిస్తూ నీ భర్తను చంపేస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. రాజకీయంగా కూడా బలం చూపిస్తూ రౌడీలతో ఫోన్లు చేయించి బెదిరిస్తున్నారన్నారు. డీఎస్పీ రెండుసార్లు కౌన్సెలింగ్ ఇచ్చినా వారిలో మార్పు రాలేదని, దయచేసి మాకు రక్షణ కల్పించాలని కోరారు.

అభిమాన ఝరి

కూటమి ప్రభుత్వం మోపిన అక్రమ కేసులతో జిల్లా కేంద్ర కారాగారంలో ఉన్న మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం విడుదలయ్యారు. తమ అభిమాన నేతను చూసి పలకరించేందుకు సర్వేపల్లి నియోజకవర్గం నుంచే కాకుండా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. జై కాకాణి అనే నినాదాలతో హోరెత్తించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



కుమార్తెను హత్తుకొని భావోద్వేగానికి లోనై..



అభివాదం చేస్తూ..



జైలు నుంచి బయటకొస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి



జైలు వద్ద నిరీక్షిస్తున్న ఆనం అరుణమ్మ, మేరిగ మురళి తదితరులు

వేగవంతంగా 'స్మార్ట్ స్ట్రీట్ బజార్'

నెల్లూరు(బారకాసు): వీధి వ్యాపారుల ఆర్థిక అభ్యున్నతి కోసం పైలెట్ ప్రాజెక్టు కింద చేపడుతున్న 'స్మార్ట్ స్ట్రీట్ బజార్' ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తెస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ తెలిపారు. నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో స్మార్ట్ స్ట్రీట్ బజార్ లబ్ధిదారులు, మెప్మా విభాగం అధికారులతో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. స్థానిక మైపాడు రోడ్డు జాఫర్ సాహెబ్ కెనాల్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ స్ట్రీట్ బజార్‌ను అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయనున్నామని తెలిపారు. ఆ దుకాణాలను పారదర్శకంగా లబ్ధిదారులకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కనకాద్రి, సెక్రటరీ శ్రీలక్ష్మి, మెప్మా విభాగం ఏఓ సుధాకర్ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లలో ప్రమాణాలు పాటించండి

నగరంలోని ఏడు అన్న క్యాంటీన్లలో సూచించిన ప్రమాణాలను తప్పనిసరిగా పాటించి ప్రజలకు అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ నందన్ నిర్వాహకులను ఆదేశించారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను ఆయన సందర్శించి ఆహార నాణ్యత, ప్రమాణాలను పరిశీలించారు. అన్న క్యాంటీన్లలో చల్లటి, సురక్షిత తాగునీరు ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. నాణ్యమైన ఆహారం అందించాలని, క్యాంటీన్ ప్రాంగణాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఆహారం స్వీకరిస్తున్న వారి సంఖ్య, సరఫరా చేస్తున్న ఆహార మోతాదు తదితర వివరాలను ఎప్పటికప్పుడు నివేదిక అందించాలని సూచించారు. అనంతరం పరమేశ్వరీనగర్ ప్రాంతం ప్రధాన మార్గంలోని చికెన్ షాపులను తనిఖీ చేసి ప్రమాణాలను ఉల్లంఘించిన కారణంగా షాపులకు జరిమానాలు విధించారు.

మద్దతు ధరపై చట్టాన్ని చేయాలి



మహాసభలో పాల్గొన్న రైతులు, నాయకులు

నెల్లూరు సిటీ: రైతులకు కనీస మద్దతు ధరపై పార్లమెంట్‌లో చట్టాన్ని చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, మూలే వెంకయ్య అన్నారు. రూరల్ మండలంలోని సౌత్‌మోపూరులో మూడో మహాసభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన తీసుకొచ్చిన రైతాంగ నల్లచట్టాలకు వ్యతిరేకంగా గత సంవత్సరం ఢిల్లీతో పాటు దేశంలోని రైతాంగమంతా కదిలి 13 నెలల పాటు ఆందోళన నిర్వహించారన్నారు. దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పిన మోదీ ప్రభుత్వం ఇంత వరకు రైతులకు కనీస మద్దతు ధర చట్టాన్ని చేయలేదన్నారు. రైతుల ఆత్మహత్యలు పునరావృతం అవుతున్నాయన్నారు. వెంటనే వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేస్తేనే దీనికి పరిష్కారమవుతుందని అభిప్రాయపడ్డారు. గ్రామాల్లో యూరియా కొరత తీవ్రంగా ఉందని, రైతులందరికీ సరిపడే విధంగా యూరియా అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడాన్ని ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. అనంతరం 11 మందితో నూతన కమిటీని ఏర్పాటు చేశారు.

ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం



నెల్లూరు (లీగల్): ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులిమి అయ్యపరెడ్డి అన్నారు. నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న బార్ అసోసియేషన్ కార్యాలయంలో గుండె జబ్బులకు సంబంధించిన ప్రాథమిక చికిత్స మందులను శుభమస్తు షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. మాల్ నిర్వాహకులు న్యాయవాదులకు అవసరమైన మందులు అందజేయడాన్ని మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సీనియర్ న్యాయవాది వేలూరు రంగారావు అభినందించారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నక్కల నాగరాజు, జాయింట్ సెక్రటరీ కేఎల్ నారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మానవత్వ దినోత్సవం



నెల్లూరు(బృందావనం): పురమందిరంలో సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ ఆధ్వర్యంలో ప్రపంచ మానవత్వ దినోత్సవాన్ని మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జిల్లాలో పలు రంగాలకు చెందిన 11 మంది మానవతా వాదులను ఘనంగా సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు పాల్గొని, మాట్లాడుతూ మానవతా వాదులను గుర్తించి సత్కరించడం అభినందనీయమన్నారు. సన్మానం అందుకున్న వారిలో శరత్‌బాబు, పాదర్తి బాలాజీ, టి.లీలాప్రభ, డి.సత్యనారాయణశర్మ, జె.వసుంధర, ఇంతియాజ్, ఆగస్టస్, పద్మావతి, శ్రీదేవి, జి.పవన్ కుమార్, ఏసురత్నం ఉన్నారు.

శాస్త్రీయ దృక్పథంతోనే సమాజాభివృద్ధి



మాట్లాడుతున్న జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ రఫీ తదితరులు

నెల్లూరు(అర్బన్): శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగితేనే సమాజాభివృద్ధి సాధ్యమని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ రఫీ, జిల్లా కార్యదర్శి డాక్టర్ బాలకోటేశ్వరరావు అన్నారు. మహారాష్ట్రలోని ప్రముఖ వైద్యుడు, జర్నలిస్టు డాక్టర్ నరేంద్ర దభోల్కర్ వర్ధంతి సందర్భంగా జాతీయ శాస్త్రీయ దృక్పథం దినోత్సవాన్ని(నేషనల్ సైంటిఫిక్ టెంపర్ డే)ను నగరంలోని బాలకోటేశ్వరరావు ఆస్పత్రిలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మూఢనమ్మకాల నిరోధ చట్టాన్ని తీసుకురావాలని పోరాటం నడిపిన నేపథ్యంలో మతోన్మాదులు 2013 ఆగస్టు 20న డాక్టర్ నరేంద్ర దభోల్కర్‌ను కాల్చి చంపారన్నారు. ఆయన త్యాగానికి గుర్తుగా జాతీయ శాస్త్రీయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ప్రజలు కుల, మతాల పేరుతో వర్గాలుగా విడిపోకుండా మూఢనమ్మకాలకు అతీతంగా ముందుకు సాగాలన్నారు. నేటికీ మన రాష్ట్రంలో కూడా చేతబడులు చేయడం, మరణించిన వారిని బతికిస్తామని, ఆకు పసర్లు పోస్తే పిల్లలు కలుగుతారని డబ్బు కోసం ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. వీటికి వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా మూఢనమ్మకాల నిరోధ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. అంతకు ముందు నరేంద్ర దభోల్కర్‌కి నివాళులర్పించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు గౌస్‌బాషా, డాక్టర్ ఓబులేశు, డాక్టర్ వేణుగోపాల్, సీనియర్ నాయకులు చక్రపాణి, ప్రసాద్, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.